ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 3
సోమవారం 9 సెప్టెంబరు 2024



అవసరాలను ఆసరాగా చేసుకుని
అఘాయిత్యం
● గర్భం దాల్చిన బాలిక
● ముగ్గురు యువకుల అరెస్ట్ 4

పండుగ పూట విషాదం

● కొద్ది నిమిషాలు గడిస్తే ఇంటికి... అంతలోనే కబళించిన మృత్యువు
● రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి

చేర్యాల, సెప్టెంబరు 8: పండుగ పూట ఆ ఇంట్లో విషాదం చోటుచేసుకున్నది. మరికొద్దిక్షణాల్లో ఇంటికి చేరుకుంటాడు అనుకునేలోపే మృత్యువు కబళించింది. రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేట్ టీచర్ మృతిచెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమురవెల్లి మండలం లెనిన్‌నగర్‌కు చెందిన దాసరి ప్రభాకర్ (36) చేర్యాలలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. శనివారం కుటుంబ పనుల నిమిత్తం బైక్‌పై చేర్యాలకు వచ్చి రాత్రి తిరుగు పయనమయ్యాడు. అయితే ఆ సమయంలో వర్షం కురుస్తుంది. గుర్జకుంట వాగు బ్రిడ్జి సమీపంలో రోడ్డుపక్కన లారీలు రాంగ్‌రూట్‌లో పార్క్ చేసి ఉన్నాయి. ఎదురుగా వస్తున్న వాహనాల లైట్ ఫోకస్‌తో లారీలు కనిపించకపోవడంతో ఓ లారీని ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, ఘటనా స్థలానికి చేరుకునేలోపే డ్రైవర్లు లారీలతో ఉడాయించారు. మృతదేహాన్ని స్థానిక మార్చురీకి తరలించారు. ఘటనాస్థలానికి లెనిన్‌నగర్ రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఐదు నిమిషాలు అయితే ఇంటికి చేరుకునేవాడు. కాసేపట్లో ఇంటికి వస్తాడని ఎదురుచూస్తున్న కుటుంబీకులకు చేదు వార్త తెలియడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు చేర్యాల పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఆదివారం పోస్టుమార్టం చేయించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. దాసరి ప్రభాకర్ మృతిపట్ల సంతాపం వ్యక్తంచేస్తూ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫోన్‌లో మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సహాయం చేయగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు మృతుడి కుటుంబసభ్యులకు అందించారు.



ప్రభాకర్(ఫైల్)

గణపయ్యకు జగ్గారెడ్డి కుటుంబం పూజలు





గంజిమైదాన్‌లోని గణపయ్యకు పూజలు నిర్వహిస్తున్న నిర్మలారెడ్డి, జయారెడ్డి, దత్తుసాయిరెడ్డి
కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గణపయ్య వద్ద జయారెడ్డి, దత్తుసాయిరెడ్డి

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 8: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో వినాయక నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన గణనాథులను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు ఆదివారం దర్శించుకున్నారు. సంగారెడ్డిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంతో పాటు గంజిమైదాన్‌లో వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకులకు టీజీఐఐసీ చైర్‌పర్సన్ తూర్పు నిర్మలారెడ్డి కూతురు జయారెడ్డి, కుమారుడు దత్తుసాయిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కమాన్ రోడ్డు వద్ద కొలువైన బొజ్జ గణపయ్య

ఏకదంతాయ మనసాస్మరామి

● మొదలైన వినాయక నవరాత్రులు ● కొలువుదీరిన గణనాథులు
● బహుముఖ రూపాల్లో దర్శనమిచ్చిన ఏకదంతుడు
● జిల్లా వ్యాప్తంగా 2,458 విగ్రహాల ఏర్పాటు



బొర్రపేరుమాండ్ల ఆలయంలో గణపతికి విశేష అలంకరణ

వేంకటేశ్వరాలయం పక్కన ఏర్పాటు చేసిన భారీ గణపతి

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 8: గణపతి బప్పా మోరియా.. జైబోలో గణపతి మహరాజ్ కీ, ఏకదంతాయ వక్రతుండాయ గౌరీ తనయాయ ధీమహీ అంటూ సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా గణపతి నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. వివిధ రూపాల్లో, ఆకృతుల్లో గణనాథులు మండపాల్లో కొలువుదీరారు. సర్వాంగ సుందరంగా ముస్తాబుచేసిన మండపాల్లో కొలువైన గణనాథులకు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. మహాగణపతి మనసాస్మరామి అంటూ మండపాల వద్ద గణేషా నామస్మరణ మారుమోగింది. బుజ్జి గణపయ్యలను ప్రతిష్ఠించి విఘ్నాలు తొలగించు వినాయకా అంటూ మనసారా పూజించారు. లంబోదరుడి పూజ సామాగ్రి కొనుగోళ్లతో రోడ్లన్నీ రద్దీగా మారాయి.

వివిధ రూపాల్లో గణనాథులు

వినాయక చవితిని పురస్కరించుకుని సిద్దిపేటలోని సిద్ధిబుద్ధి సహిత గణపతి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారిని విశేషంగా అలంకరించారు. మార్కెట్ రోడ్డులోని బొర్ర పేరుమాండ్ల ఆలయ 52వ వార్షికోత్సవం, వినాయకచవితి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం, హోమం, తులసి అర్చన నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ ఏర్పాటుచేశారు. ఇక సిద్దిపేట పట్టణంలో వివిధ రూపాల్లో వినాయక ప్రతిమలను ప్రతిష్ఠ చేశారు. ఉదయం నుంచే మేళాతాళాలతో విగ్రహాలను మండపాలకు తీసుకవచ్చారు. ఆటపాటలతో గణపయ్య ఊరేగింపు నిర్వహించి మండపం వద్దకు చేరుకున్నారు. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 2,458 మండపాలు ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. సిద్దిపేట డివిజన్‌లో ఈ సంవత్సరం 1,326 విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు అనుమతి తీసుకున్నట్లు చెప్పారు. గత ఏడాది సిద్దిపేట డివిజన్‌లో 1104 విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పట్టణంలో వివిధ ఆకృతుల్లో ఏర్పాటుచేసిన గణపయ్యలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం పక్కన శివాజీ యువసేన ఆధ్వర్యంలో 25 అడుగుల భారీ గణనాథుడిని ప్రతిష్ఠించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి లంబోదరుడి దర్శించుకున్నారు.



శంకర్‌నగర్‌లో కొలువైన ఏకదంతుడు



గాడిచెర్లపల్లిలో కలర్‌ఫుల్‌గా దర్శనమిస్తున్న మట్టిగణపతి



పట్టణంలోని కమాన్ దగ్గర అపార్ట్‌మెంట్‌లో కొలువుదీరిన గణపయ్య,
పటేల్‌పురలో లంబోదరుడికి పూజలు చేసున్న భక్తులు



నీట మునిగిన వరి పొలం (ఫైల్)

పంట నష్టంపై సర్వే

● క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు
● 3,452 ఎకరాల్లో పంట నష్టం
● వారంలో తుది నివేదిక!

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 8 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, వివరాలను సేకరిస్తున్నారు. జిల్లాలో చెరువులు, కుంటలు, వాగులు మత్తుళ్లు దూకడం, పలుచోట్ల చెరువు కట్టలు తెగిపోవడంతో వరద నీరు చేలల్లోకి చేరింది. వరి, మొక్కజొన్న, పత్తి, ఇతర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అధికారులు దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించి తుది నివేదికను అందించనున్నారు. అందులో భాగంగా దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్నారు. రైతు పేరు, పంట పేరు, ఎన్ని ఎకరాల్లో నష్టం వాటిల్లింది.. తదితర వివరాలు నమోదు చేస్తున్నారు. వారం రోజుల్లో ఈ సర్వే పూర్తి చేసి తుది నివేదికను జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి, ఆ తర్వాత ప్రభుత్వానికి అందజేయనున్నారు. అయితే వర్షాలు తగ్గుముఖం పట్టి.. వరదలు తగ్గాక అధికారులు పంట నష్టం వివరాలు సేకరిస్తుండడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వరదలు తగ్గి, పొలాల్లో నీటినిల్వలు తగ్గిన తర్వాత ఇప్పుడొచ్చి పరిశీలిస్తే ఏం లాభమని వారు ప్రశ్నిస్తున్నారు. నష్ట తీవ్రత తక్కువగా కనిపించే అవకాశం ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాథమిక అంచనా

ఇప్పటి వరకు సిద్దిపేట జిల్లాలో 2,711 మంది రైతులకు చెందిన 3,452 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. ఒక్క కోహెడ మండలంలోనే 1,191 మంది రైతులకు చెందిన 1,221 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. జిల్లా వ్యాప్తంగా వరి 1,769 ఎకరాలు, మొక్కజొన్న 273 ఎకరాలు, పత్తి 1,410 ఎకరాల్లో దెబ్బతిన్నది.



బక్రిచెప్యాలలో పంట నష్టంపై క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్న అధికారులు

క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్నాం

- రాధిక, డీఏవో



ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన వివరాలను ఏవో, ఏఈవోల ద్వారా సేకరిస్తున్నాం. 3,452 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ప్రాథమిక అంచనాగా గుర్తించాం. క్షేత్రస్థాయిలో నష్టపోయిన రైతుల పంటలను పరిశీలన చేసి త్వరలోనే తుది నివేదికను ప్రభుత్వానికి అందజేస్తాం.

బస్వాపూర్ వద్ద రాకపోకలు ప్రారంభం

వారం తర్వాత హనుమకొండ, హుస్నాబాద్ మీదుగా సిద్దిపేటకు వెళ్లే జాతీయ రహదారిపై ఆదివారం తాత్కాలికంగా రాకపోకలు ప్రారంభమయ్యారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోహెడ మండలం బస్వాపూర్ వద్ద మోయతుమ్మెద వాగు వరద ఉధృతికి తాత్కాలికంగా వేసిన రహదారి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరమ్మతులు చేపట్టిన అధికారులు రాకపోకలను పునరుద్ధరించారు.

- కోహెడ, సెప్టెంబరు 8



పలుకుబడుల భాష.. సాంస్కృతిక ప్రతీక
● నేడు తెలంగాణ భాషా దినోత్సవం 5

రూ.25 కోట్ల తండా రోడ్ల నిధులు రద్దు

● ఇతర నియోజకవర్గాలకు తరలించారంటూ బీఆర్ఎస్ ఆరోపణలు
● నర్సాపూర్‌లో ఇరు పార్టీ నాయకుల మధ్య వివాదం

నర్సాపూర్, సెప్టెంబరు 8 : నర్సాపూర్ నియోజకవర్గంలోని పలు గిరిజన తండాలకు బీటీ రోడ్ల కోసం గత ప్రభుత్వంలో మంజూరైన సుమారు రూ.25 కోట్ల నిధులు రద్దు కావడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య రచ్చ సాగుతుంది. ప్రతిపక్ష ఎమ్మెల్యే ఉందన్న ఉద్దేశంతో కావాలనే రద్దు చేసి ఇతర ప్రాంతాలకు తరలించారంటూ బీఆర్ఎస్ నాయకులు విమర్శిస్తున్నారు. నియోజకవర్గంలోని నర్సాపూర్, శివ్వంపేట, మాసాయిపేట, కౌడిపల్లి, చిలప్‌చెడ్, హత్నూర మండలాల్లోని పలు తండాలకు బీటీ రోడ్ల కోసం రూ.25.53 కోట్లు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్టీ ఎస్‌డీఎఫ్ ఫండ్ నుంచి మంజూరు చేశారు. అందులో నర్సాపూర్ మండలంలో మొత్తం ఏడు పనులకు రూ.7.81కోట్లు, శివ్వంపేటలో రూ.9.36కోట్లు, కౌడిపల్లి మండలంలో రూ.8.36కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులకు సంబంధించి ఇప్పటివరకు నాలుగు సార్లు టెండర్లు వేశారు. గత ప్రభుత్వంలో బిల్లులు సకాలంలో రావడం లేదని కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొనడానికి ఆసక్తి చూపలేదని అధికార వర్గాల ద్వారా తెలిసింది. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా సునీతారెడ్డి ఉన్నందున కావాలనే కక్ష పూరితంగా ఆ నిధులను ఇతర నియోజకవర్గాలకు మళ్లించారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి సైతం మీడియా సమావేశంలో గిరిజన తండాలకు బీటీ రోడ్ల కోసం ఎస్టీ ఎస్‌డీఎఫ్ కింద మంజూరైన నిధులను కాంగ్రెస్ ఓడినందునే, కావాలనే మళ్లించారంటూ విమర్శించారు.

కోహెడలో మంత్రి పొన్నం పర్యటన

● సమస్యలు విన్నవించిన రైతులు, ప్రజలు

కోహెడ, సెప్టెంబరు 8 : కోహెడ మండలంలో బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం పర్యటించారు. గొట్లమిట్ట గ్రామంలో 800 ఏళ్ల క్రితం కాకతీయుల కాలంలో నిర్మించిన శ్రీవరసిద్ధ లింగేశ్వర దేవస్థానం ఆలయ పునర్నిర్మాణంలో ఆలయ ద్వార స్థాపనలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారాయణపుర్‌లో హనుమాన్ ఆలయం, వినాయక మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. రామచంద్రపుర్‌లో ఇటీవల కెనాల్‌లో పడి మృతి చెందిన గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొబ్బల కనకారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వరదల వల్ల నారాయణపూర్‌లో రేణుకా ఎల్లమ్మ వాగు కెనాల్ కొట్టుకుపోవడంతో పొలాల్లోకి నీరు చేరుతుందని రైతులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. ఓగులాపూర్‌లోని సమస్యలపై మంత్రి ఆరా తీశారు. మండలంలోని శనిగరంలో భారీ వర్షాల కారణంగా కూలిన ఖబరాస్తాన్ ప్రహరీని నిర్మించాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. నిర్మాణానికి ఎన్ని నిధులు కావాలో ప్రతిపాదనలు తయారు చేసి ఇవ్వాలని, తద్వారా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. సబ్సిడీపై రైతులకు వేరుశనగ విత్తనాలు రాలేదని మంత్రికి వివరించడంతో వ్యవసాయ అధికారి సతీష్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. చెంచల్ చెరువుపల్లికి బస్ సౌకర్యం కల్పించాలని కోరారు. భవన నిర్మాణం పూర్తయిన అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం కాలేదని నాయకులు తిరుపతిరెడ్డి మంత్రి దృష్టికి తీసుకురాగా త్వరలోనే ప్రారంభించుకుందామని పొన్నం హామీ ఇచ్చారు. తంగళ్లపల్లి పిల్లివాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, కోహెడ వెళ్లే దాలోట ఉన్న మోయ తుమ్మెద వాగుపై నిర్మించిన చెక్ డ్యాం కొంత మేర కొట్టుకుపోయిందని మంత్రి దృష్టికి తీసుకరాగా హై లెవెల్ బ్రిడ్జికి ప్రతిపాదనలు తయారు చేసి ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య, నాయకులు బస్వరాజు శంకర్, జగన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మంజులారెడ్డి, కర్ర శ్రీహరి, కర్ర రవి, కొంపెల్లి శశిధర్, అబ్దుల్ రహీమ్, నక్క అనిల్, రాజ్ మహ్మద్, బోయిని సంపత్, బైరి సుదాకర్, బి నారాయణ గౌడ్, పాము శ్రీకాంత్, చిగురు కొమురయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్‌లో పూజలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్



గొట్లమిట్ట ఆలయ ద్వార స్థాపనలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి పొన్నం

పలు వినాయక మండపాల్లో పూజలు

హుస్నాబాద్: హుస్నాబాద్‌లో ఆదివారం రాత్రి పలు వినాయక మండపాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పూజలు నిర్వహించారు. పద్మశాలి సేవా సంఘం, గణేశ్‌నగర్, గాంధీ రోడ్డు, సాయిబాబా దేవాలయం, నాగారం రోడ్డుతో పాటు పలు వినాయక మండపాల్లో పూజలు చేశారు.

అవసరాలను ఆసరాగా చేసుకుని అఘాయిత్యం

- గర్భం దాల్చిన బాలిక
- ముగ్గురు యువకుల అరెస్ట్

దుబ్బాక, సెప్టెంబరు 8: కుటుంబ అవసరాలను ఆసరాగా చేసుకుని బాలికపై అత్యాచారానికి పాల్పడి గర్భవతిని చేసిన ముగ్గురు యువకులను అరెస్ట్ చేసినట్టు సిద్దిపేట ఏసీపీ జీ.మధు తెలిపారు. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని వార్డులో ఓ కుటుంబం నివాసముంటోంది. దుబ్బాకకు చెందిన ఓ యువకుడు, భూంపల్లి మండలానికి చెందిన ఇద్దరు యువకులు ఆ కుటుంబ అవసరాలను ఆసరాగా చేసుకుని బాలిక(14)ను సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయం చేసుకున్నారు. ఈ క్రమంలో ఒకరికి తెలియకుండా ఒకరు బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. దీంతో ఆ బాలిక గర్భం దాల్చడంతో తల్లిదండ్రులు దుబ్బాక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ముగ్గురు యువకులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని ఏసీపీ మధు తెలిపారు. ఆయనతో పాటు దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గంగరాజు ఉన్నారు.

ప్రమాదకరంగా ఇళ్ల మధ్య నీటి కుంట



మద్రి గ్రామంలో ఇళ్ల మధ్యన నీటి కుంట

కోహీర్, సెప్టెంబరు 8: సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం మద్రి గ్రామంలో ఇళ్ల మధ్యన నీటి కుంట ప్రమాదకరంగా ఉన్నది. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో కుంట నీటితో పూర్తిగా నిండింది. ఇళ్ల మధ్యన కుంట ఉండటం వల్ల మూగ జీవాలు, చిన్నపిల్లలు అందులో పడిపోయే ప్రమాదం ఉంది. గతంలో ఈ నీటి కుంటలో గ్రామానికి చెందిన ఓ బాలుడు పడి మృతిచెందాడు. అయినా ఆ కుంటను పూడ్చేందుకు అధికారులు ఏమాత్రం చొరవ చూపడం లేదని స్థానికులు తెలిపారు. ఇళ్ల మధ్యన నీటి కుంట ఉండటం వల్ల చుట్టుపక్కల ఇళ్లవారు భయాందోళన చెందుతున్నారు. మురుగు, వరద నీటితో నిండి ఉన్న కుంటలో ఈగలు, దోమల వ్యాప్తి చెంది అనారోగ్యాల బారినపడతామని వాపోతున్నారు. ఇదిలా ఉండగా ఈ నీటి కుంట పాఠశాలకు అతి సమీపంలో ఉండడం వల్ల చిన్న పిల్లలు ఆడుకునేందుకు వెళ్లి అందులో పడిపోయే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని గతంలో పలుమార్లు జిల్లా అధికారులకు తెలియజేసినా.. ఇప్పటివరకు కుంటను పూడ్చలేదని స్థానికులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆ కుంటను మూసేసి, ఏదైనా భవనం నిర్మిస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు.





సంగారెడ్డిలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన హస్తకళా మేళాలో అమ్మకానికి ఉంచిన చేనేత వస్త్రాలు, దుస్తులు, కళాకారులు తయారు చేసిన వస్తువులు

చేనేత హస్తకళా మేళా.. భళా

- కళాభారతి ఆధ్వర్యంలో టీటీడీ మండపంలో ఏర్పాటు
- ఆకట్టుకుంటున్న హస్తకళా ఉత్పత్తులు
- నెలరోజులపాటు చేనేత వస్త్ర ప్రదర్శన, విక్రయాలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 8: సంగారెడ్డిలోని టీటీడీ కల్యాణ మండపంలో శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటున్నది. అఖిల భారత హస్తకళా చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకం పేరిట ఏర్పాటు చేసిన ఈ మేళా ఈనెల 1న ప్రారంభించగా, ఈ నెలాఖరు వరకు కొనసాగనున్నది. అంతరించిపోతున్న హస్తకళలకు ఆజ్యం పోయాలనే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన ఈ మేళాలో హస్తకళా ఉత్పత్తులు ప్రత్యేకంగా ఆకర్షిస్తుండగా, కళాకారులచే నేరుగా విక్రయిస్తున్నారు.

200 రకాల చేనేత వస్తువుల ప్రదర్శన, అమ్మకం

ప్రపంచ ప్రసిద్ధి చెందిన సుమారు 200కు పైగా హస్తకళలు, చేనేత వస్త్రాలను ఈ మేళాలో ప్రదర్శనగా ఉంచారు. పోచంపల్లి, గద్వాల, నారాయణపేట, సిద్దిపేట, వరంగల్, వెంకటగిరి, మంగళగిరి, చీరాల, ఉప్పాడ, కంచి, ధర్మవరం, చేనేత కాటన్, పట్టు వస్త్రాలు, డ్రెస్ మెటీరియల్స్, శారీస్, బెడ్‌షీట్స్, టవల్స్ వంటి ఎన్నో రకాల చేనేత వస్త్రాలు ఈ మేళాలో ప్రదర్శించి విక్రయిస్తున్నారు. ఇవేకాకుండా మన దేశంలోనే పేరెన్నికగన్న కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, నిర్మల్‌టాయిస్, హైదరాబాద్ మంచి ముత్యాలు, మైసూర్ రోజ్‌వుడ్, సహారన్‌పూర్ వుడ్ కార్వింగ్, వరంగల్ లెదర్ బ్యాగులు, బంజార ఎంబ్రాయిడరీ, బెంగాల్ జ్యూట్ బ్యాగ్స్ ఇలాంటి ఎన్నో ప్రసిద్ధిచెందిన వస్తువులు, వస్త్రాలను అందుబాటులో ఉంచారు. వివిధ రాష్ట్రాల నుంచి ఎంతోమంది కళాకారులు ఉమ్మడిగా ఏర్పడి వస్త్రాలు, వస్తువులను తయారుచేసి ప్రదర్శనలో ఉంచి విక్రయాలను జరిపి జీవనోపాధి పొందుతున్నారు. అంతరించిపోతున్న హస్తకళలను ప్రజలు ప్రోత్సహించి, కళాకారులకు జీవనోపాధినిస్తూ, వారి కళా నైపుణ్యతకు సృజనాత్మకతను ఆదరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఈ నేపథ్యంలో ప్రజలు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని శ్రీ కళాభారతి అధ్యక్షులు ప్రసాదరావు కోరారు.



ప్రదర్శనలోని వస్తువులు

గాడిద పాల విక్రయంతో ఉపాధి

నారాయణఖేడ్, సెప్టెంబరు 8: గాడిద పాలను విక్రయిస్తూ కర్ణాటకలోని ఔరాద్‌కు చెందిన రత్నమ్మ అనే మహిళ ఉపాధి పొందుతోంది. గాడిద పాలు తాగించడం వల్ల చిన్నారులకు జలుబు, జ్వరంతో పాటు మొగుళ్ల జబ్బు, పెద్దవారికి కూడా నొప్పులు తగ్గుతాయని, అందువల్ల గాడిద పాల ఔషధ గుణం తెలిసినవారు కొనుగోలు చేస్తారని ఆమె తెలిపింది. తమ వద్ద ఉన్న పెంపుడు గాడిదను తీసుకొని గ్రామాల్లో తిరుగుతూ అవసరమైన వారికి అక్కడికక్కడే 5 ఎంఎల్ బాటిల్‌లో పాలను రూ.150 చొప్పున విక్రయిస్తామన్నారు. గాడిద పాల విశిష్టత తెలిసిన వారే కొనుగోలు చేస్తారని, పట్టణ ప్రాంతాల్లో ఎవ్వరూ కొనుగోలు చేయరని తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుతూ పాలను విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నట్లు రత్నమ్మ పేర్కొన్నది.



ఖేడ్‌లో గాడిద పాలు విక్రయిస్తున్న రత్నమ్మ



వినాయక చవితిని పురస్కరించుకుని పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలోని తన ఇంటి ఆవరణలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి పూజలో కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్ సతీసమేతంగా పాల్గొన్నారు.
- పటాన్‌చెరు రూరల్

హోరాహోరీగా చదరంగం పోటీలు

● రాష్ట్రస్థాయికి ఎనిమిది మంది క్రీడాకారుల ఎంపిక



చదరంగం పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 8: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి చదరంగం పోటీలు హోరాహోరీగా జరిగాయి. అండర్-11 బాలిబాలక విభాగంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన అక్షిత, ప్రీతిజోష్న అనన్య, అనివిత, సాయిసాత్విక్‌గౌడ్, ఆశ్రిత్, విశ్వక్‌సేనగౌడ్, తేజగౌడ్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేందర్ తెలిపారు. ఈ నెల 14, 15వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాషస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని వెల్లడించారు. ప్రతిభ కనబరిన క్రీడాకారులకు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్, రెజ్లింగ్ అసోసియేషన్ సెక్రటరీ మాధవరెడ్డి బహుమతులు అందజేశారు.

రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు..

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10న మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో అండర్- 14, 16, 18, 20 బాలబాలికలకు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 19న ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. మిగితా వివరాలకు 9963005540 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బీసీ కమిషన్ సభ్యురాలిగా బాలలక్ష్మి



చేర్యాల, సెప్టెంబరు 8 : తెలంగాణ ఉద్యమ బిడ్డ రంగు బాలలక్ష్మిని రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమిషన్ సభ్యురాలిగా నియమించింది. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామానికి చెందిన ఆమె తెలంగాణ ఉద్యమ సమయంలో ఓయూ జేఏసీ నాయకురాలిగా తనదైన శైలితో గళంవిప్పి చెరగనిముద్ర వేసుకుంది. 2017లో కాంగ్రెస్ పార్టీలో చేరిన బాలలక్ష్మి సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన సమయంలో ప్రధాన కార్యదర్శిగా కొనసాగారు. తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా, ఏఐసీసీ ఎల్‌డీఎం కో-ఆర్డినేటర్‌గా, పార్లమెంటు ఎన్నికల సమయంలో భువనగిరి కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఉద్యమకారుల కోటాలో జనగామ టికెట్ ఆశించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బీసీ కమిషన్ సభ్యురాలిగా అవకాశమివ్వగా ఆమెకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై బాలలక్ష్మి మాట్లాడుతూ బీసీలు ఎదుర్కుంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పాటుపడతానన్నారు.

టీచర్లకు పాన్ ఇండియా ఐకానిక్ అవార్డులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 8 : విద్యారంగంలో విశేషంగా కృషి చేసిన సంగారెడ్డి జిల్లాలోని నలుగురు ఉపాధ్యాయులను పాన్ ఇండియా ఐకానిక్ అవార్డులు వరించాయి. సిద్దారెడ్డి(తేర్పోల్ జడ్పీహెచ్ఎస్), చంద్రశేఖర్ (ఫసల్‌వాది జడ్పీహెచ్ఎస్), రాధిక(అందోల్ జడ్పీజీహెచ్ఎస్), అంజన(తడ్కల్ జడ్పీహెచ్ఎస్)లకు అవార్డులు దక్కాయి. సీబీఐ మాజీ అధికారి జేడీ లక్ష్మీనారాయణ, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే మహ్మద్ నజీర్, వెస్ట్ ఎమ్మెల్యే మాధవి చేతుల మీదుగా వారు సన్మానం పొందారు. సౌత్ ఇండియాలోని సుమారు ఆరు రాష్ట్రాలకు చెందిన వెయ్యి మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సన్మానం గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డులో నమోదైందని ఉపాధ్యాయులు తెలిపారు.

దామరకుంట ఉపాధ్యాయుడికి..



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మం

మర్కుక్, సెప్టెంబరు 8: సిద్దిపేట జిల్లాలోని దామరకుంట ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చిన్న బ్రహ్మయ్య పాన్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో ఆయనను ఏపీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు సన్మానించి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందించారు.

ఇద్దరు దొంగలకు రిమాండ్

న్యాల్‌కల్, సెప్టెంబరు 8: బంగారాన్ని దొంగిలించిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహనరెడ్డి తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సంగన్న తనభార్య రుక్మిణితో కలిసి ఈ నెల 6న ద్విచక్రవాహనంపై న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్ గ్రామంలో బంధువుల ఫంక్షన్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామం వద్ద బీదర్‌కు వెళ్లే రహదారిపై ఇద్దరు వ్యక్తులు వారిని వెంబడించి ఖలీల్‌పూర్ గ్రామానికి చేరుకోగానే గ్రామం చివరలోని వైకుంఠధామం వద్ద అడ్డగించి రుక్మిణి మెడలో ఉన్న మూడున్నర తులాల పుస్తెలతాడును లాక్కుని పారిపోయారు. సంగన్న ఫిర్యాదు మేరకు హద్నూర్ సీఐ జక్కుల హన్మంతు, ఎస్ఐలు రామానాయుడు, నరేష్ పూర్తి వివరాలను తెలుసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆదివారం న్యాల్‌కల్ మండలంలోని రుక్మాపూర్ చౌరస్తా వద్ద సయ్యద్‌మహ్మద్(హాక్‌కాలనీ-బీదర్), షేక్‌నదియాల్(బీదర్) అనే ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా ఆటోదిగి రుక్మాపూర్‌కు నడిచివెళ్తున్న క్రమంలో పోలీసులు వారిని పట్టుకున్నారు. అనంతరం బాధితుడు సంగన్న చెప్పిన పోలికల ఆధారంగా విచారించగ తామే దొంగిలించామని ఒప్పుకున్నారన్నారు. ఈ మేరకు వారి వద్ద మూడున్నర తులాలబంగారం(పుస్తెలతాడు), బజాజ్‌పల్సర్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వనదుర్గామాతకు పూజలు

పాపన్నపేట, సెప్టెంబరు 8 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గ మాత ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయం వద్ద వారం రోజులుగా వరద ప్రవాహం కొనసాగుతుండడంతో ఆలయాన్ని మూసివేసిన సంగతి విదితమే. అర్చకులు రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించడంతో ఆలయం వద్ద సందడి నెలకొన్నది. పలువురు బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బారికేడ్ల వద్ద నిల్చుని వరద ప్రవాహాన్ని వీక్షించారు.



అమ్మవారి ఉత్సవ విగ్రహం వద్ద భక్తుల తాకిడి

పలుకుబడుల భాష.. సాంస్కృతిక ప్రతీక

నేడు తెలంగాణ భాషా దినోత్సవం

జోగిపేట, సెప్టెంబరు 8: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించినప్పటి నుంచీ సెప్టెంబరు 9న తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాం. 'పలుకుల భాష కాదు... పలుకుబడుల భాష కావాలి' అని ప్రకటించిన తెలంగాణ సాంస్కృతిక ప్రతీక, కవి, భాషా ఉద్యమకారుడు కాళోజీ నారాయణరావు జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా అధికారికంగా జరపాలని 2014 సెప్టెంబరు 9న వరంగల్‌లో నిర్వహించిన కవి కాళోజీ శత జయంత్యుత్సవాల్లో అప్పటి ప్రభుత్వాధినేతగా కేసీఆర్ ప్రకటించారు. అప్పటి నుంచీ సెప్టెంబరు 9ని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాం. 2015 నుంచీ ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఈ ఉత్సవాలను జరపడం, అదేరోజు కవి కాళోజీ సాహిత్య పురస్కార ప్రదానం చేయడం ప్రారంభమైంది.

గతమెంతో ఘనం..

'దేశ భాషలందు తెలుగు లెస్స' అని శ్రీకృష్ణ దేవరాయలు పొగిడినా, 'ఇటాలియన్ ఆఫ్‌ది ఈస్ట్' అని నికోలాయిడ్ చేత పిలువబడ్డా, సీపీ బ్రౌన్ 'మధురమైన తెలుగు' అన్నా, పాల్కురికి సోమనాథుడు 'జాను తెలుగు' అన్నా అవన్నీ గతంలోనే. ఐక్యరాజ్య సమితి సాంస్కృతిక విభాగం (యునెస్కో) ప్రకారం ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషల్లో తెలుగుది 13వ స్థానం. దేశంలో హిందీ తరువాత ప్రజలు మాట్లాడే రెండో అతి పెద్ద భాష కూడా తెలుగే. కొంతకాలం క్రితం.. తెలుగుభాషకు ప్రాచీన భాష హోదా దక్కింది. అదే సమయంలో అంతరించాల్సిన భాషలో తెలుగుభాషను చేర్చే సమయం ఆసన్నమైందని అదే 'యునెస్కో' హెచ్చరించడం ఎంతో విచారించదగ్గ విషయం. ఆత్మీయతను ప్రతిబింబించే అమ్మ, నాన్న, తాత, నానమ్మ, అమ్మమ్మ, మామయ్య, అత్త, అక్క, చెల్లి, అన్న, తమ్ముడు లాంటి తెలుగు పదాలను వీడి ఇంగ్లిష్ మోజులో మమ్మీ, డాడీ సంస్కృతికి బానిసలైపోతున్నాం. ఇంగ్లిష్ యాసలో తెలుగును 'టెల్గూ' అనీ, హైదరాబాద్‌ను 'హైద్రా బ్యాడ్' అనీ ఉచ్చరించడం నాణానికి ఇంకో పార్శ్వంగా చెప్పుకోవచ్చు. మాతృభాషను విస్మరిస్తున్నామంటే అమ్మను మరిచిపోతున్నామన్న మాట. మమ్మీ, డాడీ సంస్కృతిని వీడి అమ్మ, నాన్న (నాయన) లాంటి మధురమైన తెలంగాణ పదాలను వాడేలా పిల్లల్ని ప్రోత్సహిస్తూ ఆ పిలుపుల్లోని మాధుర్యాన్ని పిల్లలకు అర్థం చేయాలి. సాధ్యమైనంత వరకూ తెలంగాణ పదాలనే వాడుతూ ఒక పదిని మిషాలు మాట్లాడేలా పిల్లలను ఉత్సాహపరుస్తూ వారిలో భాషా నైపుణ్యాన్ని పెంచుతూ, భాష పట్ల మోజును పెరిగేలా ప్రోత్సహించాలి.

మాతృభాషను మృత భాషగా మార్చొద్దు..

గణపతి ఇందిర, తెలుగు భాషోపాధ్యాయురాలు మాతృభాషను మృత భాషగా చేయడంలో 'తిలా పాపం తలా పిడికెడు' అన్న చందంగా అందరూ బాధ్యులే. ఇప్పటికే రోజు రోజుకూ ఆదరణ తగ్గుతున్న తెలుగు మాటలను అందరూ బతికించుకోవాలి. ఇది ప్రతీ ఇంటి నుంచి మొదలుకావాలి. ప్రతీ ఇంటిలోనూ తప్పనిసరిగా తెలుగులోనే మాట్లాడాలి. ఇంగ్లీషు మీడియం స్కూళ్లలో పిల్లలను చేర్చినా వారికి తప్పనిసరిగా తెలుగును బోధిస్తూ, తెలుగులో మాట్లాడేలా తీర్చిదిద్దాలి. ఇక, అధికార భాషా సంఘం, తెలుగు విశ్వవిద్యాలయం, ప్రభుత్వం కూడా తెలుగుకు పునర్ వైభవం దక్కేలా ప్రయత్నించాలి. అస్తిత్వాన్ని కోల్పోతున్న అమ్మ భాషను కాపాడుకోవడానికి అనుసరించాల్సిన బాధ్యత సమాజంలోని అందరిపైనా ఉన్నది. దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళల్లో తమ మాతృభాషకు అటు ప్రభుత్వాలు, ఇటు ప్రజలు పెద్దపీట వేస్తుంటే మన రాష్ట్రంలోని ప్రభుత్వం, ప్రజలు పరాయి భాష మోజులో పడి మాతృభాషను చంపుకోవడం శోచనీయం. ఇది మారాలి. ఈ మార్పు ప్రతీ వారి ఇంటిలోనుంచే మొదలుకావాలి. జీవన పోరాటంలో ఇంగ్లిష్ భాష తప్పనిసరి అయినా, ఇంటిలో తప్పకుండా తెలుగు మాటలను మాట్లాడేలా పిల్లలను ప్రోత్సహించాలి.



తంపులూరి ఇందిర

సాహిత్యంతో మానవ జీవితం సుసంపన్నం

● ఎమ్మెల్సీ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గోరటి వెంకన్న



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

సదాశివపేట, సెప్టెంబరు 8: సాహిత్యం మానవ జీవితాన్ని సుసంపన్నం చేస్తుందని ఎమ్మెల్సీ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గోరటి వెంకన్న అన్నారు. ఆదివారం సదాశివపేటలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో (అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక-వికారాబాద్, సదాశివపేట మిత్ర బృందం) ఆధ్వర్యంలో నిర్వహించిన కాళోజి జయంతి-తెలంగాణ భాషాదినోత్సవం-కవి సమ్మేళనం వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సాహిత్యం సమాజ చైతన్యం కోసం సాగే నిరంతరప్రక్రియ అన్నారు. సాహిత్యం కవి గుండె లోతుల్లో నుంచి పుట్టుకురావాలన్నారు. సాహిత్యానికి కులం, మతం, ఏదీ అడ్డు కాదన్నారు. ఈ సందర్భంగా గోరేటి వెంకన్న తన ఆట, పాట, మాటలతో రక్తి కట్టించారు. అనంతరం ప్రముఖ సాహితీవేత్తలు ఏనుగు నర్సింహారెడ్డి, తుల్జారాంసింగ్, నర్సింహులుగుప్తా మాట్లాడుతూ కాళోజి తెలుగు యాస, సంస్కృతుల పరిరక్షణ కోసం తెలంగాణ ప్రజలను చైతన్యవంతుల్ని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కుమారుడు చింతా సాయినాథ్, మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణపాటిల్, వైస్ చైర్మన్ చింతా గోపాల్, వందల మంది యువసాహితీ కళాకారులు పాల్గొన్నారు.

రుణమాఫీలో తప్పుడు సమాచారం

● ఐదుగురు సీఈవోలపై వేటుకు రంగం సిద్ధం

నారాయణఖేడ్, సెప్టెంబరు 8: రుణమాఫీ విషయంలో ప్రభుత్వానికి తప్పుడు సమాచారం ఇచ్చినందుకు ఐదుగురు సీఈవోలపై ప్రభుత్వం వేటుకు రంగం సిద్ధం చేసింది. నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో 12 సహకార సంఘాలు ఉండగా, ప్రస్తుతం 6 సీడెడ్ సహకార సంఘాలు ఉన్నాయి. గతంలో 8 సీడెడ్ సహకార సంఘాలు ఉంటే, క్రిష్ణాపూర్, బొక్కస్‌గాం సహకార సంఘాలను సహకార బ్యాంకు పరిధిలోకి విలీనం చేశారు. 2017లో ఎస్‌బీహెచ్‌ను ఎస్‌బీఐలో విలీనం చేయడంతో, అప్పటి నుంచి సీడెడ్ సహకార సంఘాల పరిధిలోని రైతులకు కొత్త రుణాలు తీసుకోవడం, పాతవి రెన్యువల్ చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2018 నుంచి 2023 డిసెంబరు వరకు రుణాలుపొందిన వారికి మాత్రమే రుణమాఫీ వర్తింపజేస్తున్నది. ఈ నేపథ్యంలో ఖేడ్ పరిధిలోని సంజీవన్‌రావుపేట్, గంగాపూర్, మార్డి, కడ్పల్, కల్హేర్ సొసైటీల సీఈవోలు రైతులకు రుణమాఫీ వర్తించాలనే ఉద్దేశంతో ఈ సొసైటీల పరిధిలోని రైతులు 2019లో రుణాలు తీసుకున్నట్లు ప్రభుత్వానికి సమాచారమిచ్చారు. దీనిపై సహకారశాఖ డైరెక్టర్ ఇటీవల విచారణ జరిపించగా.. ఐదు సహకారశాఖ సీఈవోలు తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తేలింది. దీంతో కడ్పల్, సంజీవన్‌రావుపేట్, కల్హేర్, మార్డి, గంగాపూర్ సహకార సంఘాల సీఈవోలను సస్పెండ్ చేయాలని సహకార శాఖ డైరెక్టర్.. జిల్లా సహకార అధికారికి సూచించినట్లు తెలిసింది. నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని ఆరు సీడెడ్ సొసైటీలలో దాదాపు 2600 మంది రైతులకు రూ.11 కోట్ల పై చిలుకు రుణమాఫీ వర్తించకుండా పోయింది. బీబీపేట సైతం సీడెడ్ సొసైటీగా ఉన్నప్పటికీ, ఆ సొసైటీ సీఈవో మాత్రం తప్పుడు సమాచారం ఇవ్వలేదని తెలిసింది. మార్డి సొసైటీ సీఈవో ఇప్పటికే సస్పెండ్‌లో ఉండడంతో మిగతా నలుగురిపై త్వరలో వేటు పడనున్నట్లు తెలిసింది. ఈ విషయమై ఖేడ్ డివిజన్ సహకార శాఖ అధికారి చిన్నారావును సంప్రదించగా.. ఐదుగురిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించినప్పటికీ, మార్డి సీఈవో ఇప్పటికే సస్పెండ్‌లో ఉన్నారని, మిగతా వారిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.



పరిశోధకులతో కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ అభయ్ కరాండీకర్

ఐఐటీహెచ్ పరిశోధనలను ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలి

● కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ సెక్రెటరీ అభయ్ కరాండీకర్

● ఐఐటీహెచ్‌లో సాతి సెంటర్, డిజిటల్ హెరిటేజ్ ల్యాబ్ ప్రారంభం

కంది, సెప్టెంబరు 8: ఐఐటీహెచ్ పరిశోధనలు ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ సెక్రెటరీ అభయ్ కరాండీకర్ అన్నారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఆదివారం డీఎస్‌టీ- సాతి సెంటర్ (అధునాతన విశ్లేషణ, సాంకేతిక సహాయ సంస్థ)ను, డిజిటల్ హెరిటేజ్ ల్యాబ్‌లను ఆయన ప్రారంభించారు. దీనికి ఇన్-సిటు కోరిలేటివ్ మైక్రో స్కోపీ సెంటర్ మద్దతు ఉన్నది. ఈ సాతి సెంటర్ అత్యాధునిక మైక్రోస్కోపీ పద్ధతులను ఉపయోగించి వినూత్న పరిష్కారాలపై సహకరించడానికి సైన్స్‌లోని వివిధ విభాగాల్లోని శాస్త్రవేత్తలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. భౌతికశాస్త్రాలు, రసాయనశాస్త్రం, జీవశాస్త్రం, ఔషధ అధ్యయనాలతో సహ విస్తృత శ్రేణి శాస్త్రీయ విభాగాల నుంచి శాస్త్రవేత్తలను ఒకచోట చేర్చి, అధునాతన మైక్రోస్కోపీ పద్ధతులను ఉపయోగించడం ద్వారా మాత్రమే పరిష్కరించగల సాధారణ శాస్త్రీయ లక్ష్యాలను పరిష్కరించడానికి సాతి సెంటర్ ఉద్దేశించబడింది. డీఎస్‌టీ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాజీ)కి రూ.60 కోట్ల నిధులతో పాటు 17 విద్యా, పారిశ్రామిక, పరిశోధన సంస్థల సహకారం ఉంది. ఈ సందర్భంగా అభయ్ కరాండీకర్ మాట్లాడుతూ దేశంలోని పరిశోధన ఆవిష్కరణల పర్యావరణల వ్యవస్థలను మెరుగు పరచడానికి ప్రాముఖ్యత ఇస్తున్నామన్నారు. ప్రతీ ఒక్కరిలో పరిశోధన సంస్కృతిని పెంపొందించడానికి దేశవ్యాప్తంగా అత్యాధునిక పరిశోధన మౌలిక సదుపాయలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ప్రపంచస్థాయి పరిశోధనలు కేంద్ర సహకారం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఐఐటీహెచ్‌లో టీహన్ ప్రాంగణంలో డ్రోన్ల ప్రదర్శనలు, త్రీడీ టెక్నాజీని ఆయన పరిశీలించారు. బీవీఆర్ మోహన్‌రెడ్డి (చైర్మన్ బోర్డ్ ఆఫ్ గవర్నన్స్ చైర్మన్, ఐఐటీ హైదరాబాద్), ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్.మూర్తి, ప్రొఫెసర్. బి.జగదీశ్వరరావు (వైస్ చాన్సలర్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం), డాక్టర్ కృష్ణ ఎల్లా (చైర్మన్ భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్), అన్ని భాగస్వామ్య సంస్థల అధిపతులు హాజరయ్యారు. వినూత్న సాంకేతిక పరిజ్ఞానం ద్వారా దేశ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడడంలో ఐఐటీ హైదరాబాద్ ముందంజలో ఉందని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి వెల్లడించారు.

నాణ్యత లేని బియ్యం మాకొద్దు

అల్లాదుర్గం సెప్టెంబరు 8: నాణ్యతలేని బియ్యం మాకొద్దు అంటూ మండలంలోని రాంపూర్ గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. రేషన్ దుకాణం ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యం నాణ్యతగా లేవని, ముక్కిపోయి దుర్వాసన వస్తున్నాయని తెలిపారు. నాణ్యతలేని బియ్యాన్ని వెంటనే మార్చేయాలంటూ నిరసన తెలిపారు. రేషన్ దుకాణాల ద్వారా నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలని కోరారు.



అల్లాదుర్గం మండలం రాంపూర్ గ్రామానికి వచ్చిన రేషన్ బియ్యాన్ని చూపిస్తూ ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

అత్తింటి వేధింపులు తాళలేక

నవవధువు ఆత్మహత్య



శైలజ(ఫైల్)

హవేళిఘణపూర్, సెప్టెంబరు 8: అత్తింటివారి వేధింపులు తాళలేక నవ వధువు ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని వాడి గ్రామానికి చెందిన ఇమ్మడి శైలజ(19) గ్రామంలోని బలిజ సుధీర్ అనే వ్యక్తిని ప్రేమించి, గ్రామస్థుల సహకారంతో మూడునెలల క్రితం పెళ్లి చేసుకుంది. కాగా, పుట్టింటి నుంచి వరకట్నం తేవాలని, నీ వల్ల బంధువులందరూ దూరమయ్యారని తిడుతూ శైలజను కొన్ని రోజులుగా భర్తతోపాటు అత్త సువర్ణ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. శైలజ ఈ విషయాన్ని తన అన్న రామకృష్ణకు చెప్పడంతో రూ.లక్ష ఇచ్చారు. అయినా వేధింపులు ఆగకపోవడంతో మనస్తాపం చెందిన శైలజ పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు మొదటగా మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి సిరిసిల్లా జిల్లాలోని ఎల్లారెడ్డిపేట హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. మృతురాలి అన్న రామకృష్ణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

పాపం పసికందు

● అప్పుడే పుట్టినబిడ్డను చెత్తకుప్పలో పడేసిన వైనం

● చికిత్స అందించి మాతా శిశుకేంద్రానికి అప్పగింత

దుబ్బాక, సెప్టెంబరు 8: మానవత్వం మంటగలిసింది.. నవమాసాలు మోసిన బిడ్డను పుట్టగానే గుర్తు తెలియని వ్యక్తులు చెత్త కుప్పలో పారేశారు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తిమ్మాపూర్‌లో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం తిమ్మాపూర్ బుడగజంగాల కాలనీలోని ముళ్లపొదల్లో పసికందు ఏడుపులు వినిపించాయి. గ్రామస్థులు అక్కడికి వెళ్లి చూడగా.. అప్పుడే పుట్టిన మగ పసికందు కనిపించింది. సమాచారం అందుకున్న దుబ్బాక పోలీసులు అక్కడికి చేరుకుని ఆ పసికందును సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. మాతా శిశుకేంద్రానికి అప్పగించారు. పసికందు ఆరోగ్యం నిలకడగానే ఉందని, విచారణ జరుపుతున్నట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

బైకును ఢీకొట్టిన లారీ

● యువకుడికి తీవ్రగాయాలు.. పరిస్థితి విషమం



తీవ్రంగా గాయపడిన ఒగ్గు శ్రీనివాస్

శివ్వంపేట, సెప్టెంబరు 8: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన సుభాష్‌పల్లి శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గంగయ్య పల్లి గ్రామానికి చెందిన ఒగ్గు శ్రీనివాస్(21) ద్విచక్ర వాహనంపై తూప్రాన్ వెళ్తుండగా గుర్తుతెలియని లారీ వెనుక నుంచి ఢీకొంది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీ కూడా బైకును ఢీకొనడంతో శ్రీనివాస్ తలకు బలమైన గాయమైంది. స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించి, క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు కటుంబ సభ్యులు తెలిపారు.

కాలుజారి చెరువులో పడి రైతు మృతి



కరుణాకర్(ఫైల్)

నిజాంపేట, సెప్టెంబరు 8: ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి రైతు మృతిచెందాడు. ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన రైతు రెడ్డి కరుణాకర్(28) శనివారం సాయంత్రం తన వ్యవసాయ పొలానికి యూరియా చల్లి చేతులు కడుక్కోవడానికి సమీపంలోని బ్రాహ్మణ చెరువుకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో అతడి తండ్రి రెడ్డి ఎల్లయ్య చెరువు వద్దకు వెళ్లి చూడగా చెప్పులు, బట్టలు చెరువు వద్దే ఉన్నా కరుణాకర్ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కలవారి సహాయంతో చెరువులో వెతకగా కరుణాకర్‌రెడ్డి మృతదేహం లభించింది. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 8: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల మేరకు బీహార్ రాష్ట్రానికి చెందిన ఎండీ బాబుల్(30) తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం తన బంధువు దిల్‌నవాజ్‌తో కలిసి బైకుపై రామాయంపేటకు బయలుదేరారు. కావేరీ స్టీల్ పరిశ్రమ సమీపంలో ఓ లారీని వెనక నుంచి వీరి బైకు ఢీకొట్టింది. ఈ ఘటనలో బాబుల్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా ఆదివారం అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

శివ్వంపేట, సెప్టెంబరు 8: గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలను పగులగొట్టి 40 తులాల వెండి, నగదును అపహరించుకుపోయిన సంఘటన మండల కేంద్రమైన శివ్వంపేటలో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు తాళ్లపల్లితండాకు చెందిన బడావత్ లక్ష్మి శివ్వంపేటలో అద్దె ఇంట్లో నివాసముంటోంది. వినాయక చవితి పండుగకు తాళ్లపల్లితండాకు వెళ్లడంతో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళాలను పగులకొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాను ధ్వంసం చేసి 40 తులాల వెండి రూ.22 వేల నగదును తస్కరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించినట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

బీరప్ప ఆలయంలో ..



ఆలయం బయట పగులగొట్టి ఉన్న హుండీ

మద్దూరు, సెప్టెంబరు 8 : మండలంలోని సలాఖ్‌పూర్ గ్రామంలోని బీరప్ప ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. శనివారం సాయంత్రం గ్రామస్థులు ఆలయం వద్దకు వెళ్లగా గేటుకు వేసిన తాళాలు పగులగొట్టి ఉండటంతో పాటు హుండీ పగులగొట్టి బయట ఉండటంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని కురుమ సంఘం సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో...

జిన్నారం, సెప్టెంబరు 8: జిన్నారం మండలం ఊట్ల పంచాయతీ దాదిగూడెంలో శనివారం రాత్రి బందం కొమ్ము మంజుల ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధిత మహిళ ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లగా తాళం పగుల గొట్టిన దొంగలు 4 తులాల బంగారం, 20 తులాల వెండి అపహరించారు. అనంతరం పక్కనే ఉన్న శ్రీరాంనగర్ కాలనీలో చోరీ చేసేందుకు వచ్చిన దొంగల కదలికలు స్థానిక సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ముఖాలకు మాస్కులు ధరించిన నలుగురు దొంగలు కాలనీలో సంచరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసారు.

కొండ చిలువ కలకలం

బెజ్జంకి, సెప్టెంబరు 8 : మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డు పై శనివారం రాత్రి కొండచిలువ కలకలం రేపింది. రోడ్డుపై పాకుతూ వెళ్తున్న కొండచిలువను చూసిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అనంతరం కొండచిలువ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని చెట్లపొదల్లోకి వెళ్లింది. ఇటీవల వచ్చిన వరద నీటిలో కొట్టుకొచ్చి ఉంటుందని, ఫారెస్టు అధికారులు కొండచిలువను పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



బెజ్జంకిలో రోడ్డుపై కొండచిలువ..


చేర్యాలలో వినాయకుడికి పూజలు చేస్తున్న మహిళలు


గజ్వేల్‌లోని 18వ వార్డులో వినాయకుడికి పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి


మిరుదొడ్డిలో కొలువుదీరిన బొజ్జగణపయ్య


తొగుటలో గణపతికి పూజలు చేస్తున్న భక్తులు

ఊరువాడా గణనాథుల సందడి

ఊరు వాడా గణనాథుల సందడి మొదలైంది. వినాయక చవితి సందర్భంగా శనివారం గణపతులను మండపాల్లో కొలువుదీర్చారు. చిన్నాపెద్దా అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ విఘ్నేశ్వరుడిని నెలకొల్పడంలో భాగస్వాములయ్యారు. భారీ సెట్టింగ్‌లతో విద్యుత్ దీపాల నడుమ ఏకదంతుడి పూజలను ఘనంగా నిర్వహించారు. ఆయా చోట్ల రాజకీయ నాయకులు, అధికారులు పార్వతి తనయుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


సిద్దిపేట క్రైం: ఏసీపీని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు


వర్గల్: గ్రామపంచాయతీ వద్ద వినాయకుడి విగ్రహం కోసం ఏర్పాటు చేసిన మండపం


హుస్నాబాద్: పూజలు అందుకోవడానికి తరలి వెళ్తున్న భారీ వినాయకుడు


కుకునూరుపల్లి: వినాయకుడిని దర్శించుకుంటున్న తొగుట సీఐ లతీఫ్, ఎస్ఐ శ్రీనివాస్


మద్దూరు: మండల కేంద్రంలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు


ములుగు: ములుగులో విఘ్నేశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు


సిద్దిపేట రూరల్: ఇర్కోడులో కొలువుదీరిన మట్టి గణపతికి పూజలు చేస్తున్న భక్తులు


హుస్నాబాద్‌లో గణనాథుడికి పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత


నారాయణరావుపేట: లక్ష్మీదేవిపల్లిలో ఏర్పాటు చేసిన గణనాథుడు


చేర్యాల: కొమురవెల్లి మల్లన్న ఆలయంలో గణపతికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


చిన్నకోడూరు: పార్వతి పుత్రుడికి పూజలు చేస్తున్న భక్తులు


బెజ్జంకి: గణనాథుడికి పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు, భక్తులు

రైతాంగ సాయుధ అమరవీరుల సంస్మరణ సభలు

- 10 నుంచి 17 వరకు: సీపీఎం మండల కార్యదర్శి బాలనర్సయ్య

కొండపాక, సెప్టెంబరు 8: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం నాడు సాగిన మహత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన వారి అమరత్వాన్ని స్మరిస్తూ, సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈ నెల 10 నుంచి 17 వరకు నిర్వహించే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సంస్మరణసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి అమ్ముల బాలనరసయ్య పిలుపునిచ్చారు. మండలంలోని వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం కరపత్రం ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రజాకార్లు, దొరలు, భూస్వాములు, జాగీర్‌దార్లకు వ్యతిరేకంగా రైతాంగ పోరాటం జరిగిందన్నారు. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుంచి నేటి వరకు అమరుల స్ఫూర్తితో ప్రజా పోరాటాలు నిర్మిస్తూ నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పటిమను పునికి పుచ్చుకున్న సీపీఎం ఆధ్వర్యంలో సెప్టెంబరు 10వ తేదీ చిట్యాల (చాకలి) ఐలమ్మ వర్ధంతి నుంచి సెప్టెంబరు 17వ తేదీ వరకు సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా అమరవీరుల సంస్మరణ సభలునిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ కనకాచారి, తాటోజు రవీంద్రచారి, కొమురవెల్లి కనకయ్య పాల్గొన్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్


గజ్వేల్: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, గజ్వేల్ నాయకులు

గజ్వేల్, సెప్టెంబరు 8: ప్రభుత్వ కార్యక్రమాలను కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో ప్రజల్లోకి తీసుకువెళ్లాలని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, గజ్వేల్ నాయకులతో కలిసి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారివెంట గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, నెంటూరు రంగారెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్, మైనార్టీ విభాగం రాష్ట్ర నాయకుడు సమీర్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, కాంగ్రెస్ గజ్వేల్ మండల అధ్యక్షుడు మద్దూరి మల్లారెడ్డి, నాయకుడు సయ్యద్ బాబలతో కలసి ఆయనను కలిసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

- **మద్దూరు:** టీపీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను శనివారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఉమ్మడి మండల మాజీ జడ్పీటీసీ సభ్యుడు గిరి కొండల్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో చేర్యాల మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగారావు, మండల మాజీ అధ్యక్షుడు బండి శ్రీనివాస్, జనగామ జిల్లా ప్రెసిడెంట్ అభ్యర్థి చెట్కూరి కమలాకర్ తదితరులు ఉన్నారు.


మద్దూరు: టీపీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి

కేసీఆర్‌కు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన అంజిరెడ్డి

మర్కుక్, సెప్టెంబరు 8: వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేసీఆర్ అంజిరెడ్డిని దీవిస్తూ రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజల కోసమే వ్యవసాయ క్షేత్రంలో చండీయాగం నిర్వహించినట్లు, రాజకీయాలకతీతంగా రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలంటూ మహా చండిని వేసుకున్నట్లు ఆయన తెలిపారు.

'ఈత మొక్కలు నాటడంలో అధికారుల నిర్లక్ష్యం'

హుస్నాబాద్, సెప్టెంబరు 8: హుస్నాబాద్ పట్టణ శివారులో ఈత మొక్కలు తెచ్చినప్పటికీ వాటిని నాటడంలో ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పచ్చిమట్ల రవీందర్ గౌడ్ ఒక ప్రకటనలో ఆరోపించారు. గడిచిన ఎండకాలంలో నిప్పు అంటుకుని తాటి, ఈత చెట్లు దగ్ధం అయ్యాయని పేర్కొన్నారు. మళ్లీ నాటేందుకు వెయ్యి వరకు ఈత మొక్కలు తెప్పించినప్పటికీ వాటిని నాటడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా నాటించాలని కోరారు.

క్రిష్ణాపూర్‌లో ప్రైవేట్ క్లినిక్, మెడికల్ షాప్ సీజ్

కల్హేర్, సెప్టెంబరు 8: మండల పరిధిలోని క్రిష్ణాపూర్‌లో నిర్వహిస్తున్న ప్రైవేటు క్లినిక్‌తో పాటు పక్కనే నడుపుతున్న మెడికల్ షాప్‌ను నారాయణఖేడ్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేశ్వర్ శనివారం సీజ్ చేశారు. మండల పరిధిలోని ఖానపూర్(కె) గ్రామానికి చెందిన బేగారి అనిల్, మంజుల అనే దంపతులు మూడు మాసాల పాపకు క్రిష్ణాపూర్ గ్రామానికి చెందిన ఆర్ఎంపీ ఎండీ. అలి తన క్లినిక్‌లో వైద్యం చేస్తుండగా పాప మరణించడంతో అతడి నిర్లక్ష్యం కారణంగానే పాప మరణించిందని బాధితుల తరఫు బంధువులు, గ్రామస్థులు అతడిపై, అతడి కుటుంబసభ్యులపై దాడికి యత్నించిన విషయం విదితమే. ఈ విషయమై పత్రికల్లో వార్తలు రావడంతో స్పందించిన జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారుల ఆదేశాల మేరకు క్రిష్ణాపూర్‌లోని క్లినిక్‌ను, మెడికల్ షాప్‌ను డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రాజేశ్వర్ సీజ్ చేశారు.

బెజ్జంకిని కరీంనగర్ జిల్లాలో కలపాలి

- జిల్లా పోరాట సాధన సమితి సభ్యులు


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

బెజ్జంకి, సెప్టెంబరు 8: బెజ్జంకి మండలాన్ని తిరిగి కరీంనగర్ జిల్లాలో కలపాలని జిల్లా పోరాట సాధన సమితి సభ్యులు దోనె వెంకటేశ్వర్‌రావు, మనాల రవి శనివారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా బెజ్జంకి మండలాన్ని కొందరు తమ స్వార్థం కోసం సిద్దిపేట జిల్లాలో కలిపారన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు బెజ్జంకి మండలాన్ని తిరిగి కరీంనగర్ జిల్లాలో కలపాలని కోరారు.

నంగనూరు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఏర్పాటు

నంగునూరు, సెప్టెంబరు 8: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ సానాదుల బాల పోచయ్య ఆధ్వర్యంలో మండల అడాక్ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా దాసరి రమేశ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా రాగుల కృష్ణ, కో కన్వీనర్లుగా నలుమాల నవీన్, సయ్యది రమేశ్, దండు రాజు, మన్నె బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ నర్సింగరావు, శ్రీరాముల వెంకటేశ్వర్లు, జాజాల కనకరాజు, దాసరి కిషన్, రాగుల ఎల్లాదాస్, నరేష్, సాయి శ్యామ్, రాగుల బాబు, బాబు తదితరులు పాల్గొన్నారు.

బీకేఎస్ మండల అధ్యక్షుడిగా ఉపేందర్‌రెడ్డి

రాయపోల్, సెప్టెంబరు 8: భారతీయ కిసాన్ సంఘ్ రాయపోల్ మండల అధ్యక్షుడిగా రాయపోల్‌కు చెందిన గల్వ ఉపేందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కూరెల్లి జశ్వంత్‌రెడ్డి ఆదివారం నియామకపత్రం అందజేశారు. ఉపాధ్యక్షుడిగా జీడిపల్లి భాల్‌రెడ్డి, కార్యదర్శిగా సోమని ఇస్తారితో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు తెలిపారు. తనకు అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు జశ్వంత్‌రెడ్డి, రాష్ట్ర నాయకత్వానికి ఉపేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు గాడిపల్లి అరుణ, మామిడిపల్లి రేణుక పాల్గొన్నారు.

311 మంది ధ్రువపత్రాల పరిశీలన


ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

నంగునూరు, సెప్టెంబరు 8: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం కోసం ఐసెట్‌లో అర్హత సాధించి స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులకు రెండో రోజు ఆదివారం రాజగోపాల్‌పేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 311 మంది ధ్రువపత్రాలను పరిశీలించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ గోవర్దన్ తెలిపారు.

మల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ

- పుల్లూరు బండ పై ఘనంగా స్వాతీ నక్షత్ర ఉత్సవం


చేర్యాల: గంగిరేగుచెట్టు ప్రాంగణంలో పట్నం వేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

చేర్యాల, సెప్టెంబరు 8: కొమరవెల్లి మల్లికార్జునస్వామి ఆలయానికి ఆదివారం భారీగా భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కుబడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. సంప్రదాయబద్ధంగా మట్టికుండలో బోనంచేసి భక్తిప్రపత్తులతో చలక, నజరు, ముఖమండప పట్నాలువేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ఒడిబియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మ దేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లంపానకం సాకపెట్టి ఒడిబియ్యాలు పోశారు. పట్నాలు వేసిన భక్తులతో ముఖమండపం, గంగిరేగు చెట్టు ప్రాంగణాలు సందడిగా మారాయి. ఈవో బాలాజీశర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- **సిద్దిపేట రూరల్:** మండలం పుల్లూరు బండపై స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో స్వాతీ నక్షత్ర ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి జన్మ నక్షత్రం అయిన స్వాతీ నక్షత్రం సందర్భంగా పుల్లూరు బండ పై క్రమం తప్పకుండా ఆలయ వంశపారంపర్య అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆలయ వంశ పారంపర్య అర్చకులు కలకుంట్ల రంగాచార్య, పిడిచేటి రామకృష్ణమాచార్య, అర్చకులు కలకుంట్ల వెంకట్, కలకుంట్ల నచికేత, సాయి కృష్ణలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ఉత్సవంలో పుల్లూరు బండ మాజీ చైర్మన్ కుమ్మరి రాములు, ఒగ్గు మురళి, తదితరులు పాల్గొన్నారు.


సిద్దిపేట రూరల్: స్వాతీ నక్షత్ర ఉత్సవంలో భాగంగా హోమం నిర్వహిస్తున్న అర్చకులు, గ్రామస్థులు

జవాన్ శ్రీనివాస్ కుటుంబానికి అండగా ఉంటాం

- సైనిక్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్


గజ్వేల్: శ్రీనివాస్ కుటుంబసభ్యులకు సహాయాన్ని అందజేస్తున్న సైనిక్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

గజ్వేల్ సెప్టెంబరు 8: దేశ భద్రత కోసం కుటుంబానికి, బంధుమిత్రులకు దూరంగా ఉంటూ సేవ చేసే సైనికులకు ఏదైనా జరిగితే సమాజం వారి కుటుంబాలకు అండగా నిలవాలని సైనిక్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. గజ్వేల్ మండలం రిమ్మనగూడకు చెందిన జవాన్ గుండారం శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని సొసైటీ సభ్యులతో కలిసి వారి కుటుంబసభ్యులకు రూ.లక్ష ఐదు వేలను అందజేశారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా సైనిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కవిత్వాల్‌రెడ్డి, శ్రీనివాస్, స్కైలాబ్‌రెడ్డి, రిమ్మనగూడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం పాల్గొన్నారు.

తోటి మిత్రుని కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డుకు చెందిన చెర్ల(జాల) రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. చిన్ననాటి మిత్రులు మృతుడి కుటుంబానికి రూ.52వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను అందజేశారు. కార్యక్రమంలో రమేశ్ మిత్రులు కాటు రాజు, కుర్రె మధుసూదన్‌రెడ్డి, మహ్మద్ షరీఫ్, గరిదాసు నవీన్‌కుమార్, రాయపోల్ పరుశురాములు, రఫీక్, బాబుగౌడ్, భూపతి కరుణాకర్, కోట సంతోష్, గుంటి రమేశ్, నాగపురి స్వామి, శ్రీరాం మల్లేశం, మర్కంటి రాజు, పెర్క పరుశురాములు, కొత్త కుమార్, గడ్డం లింగం, బత్తుల కనకయ్య గంటకొండ స్వామి, చంద సందీప్ కుమార్ తదితరులున్నారు.

- **చేర్యాల:** కొమురవెల్లి మండలం గురువన్నపేటకు చెందిన అందె వీరేశం కొద్దిరోజులక్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి మిత్రులు ఏదుల గణేశ్, భీమ లక్ష్మణ్, మకిలి కనకయ్య, భిక్షపతి, అననబోయిన స్వామి, బూరుగు కనకరాజు, పుల్ల రాయుడు, తెట్టెబావి ప్రసాద్, ప్రజ్ఞాపురం రమేశ్, తలారి మల్లేశ్ తదితరులు రూ.30వేలు విరాళం సేకరించి మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు.
- **కోహెడ:** కోహెడ గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విద్యార్థి కుటుంబానికి పాఠశాల పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. రూ 50 వేల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కోహెడ హాస్టల్ పూర్వ విద్యార్థుల బృందం జేరిపోతుల జనార్దన్, మేడి శ్రీనివాస్, ఆరేపల్లి కిరణ్, లంకదాసరి కల్యాణ్, పెద్దెల్లి మహిపాల్, కౌటం శేఖర్, ఆరే శరత్, అజయ్, జె రాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు: గజ్వేల్ సీఐ సైదా


గజ్వేల్: డీజేల యజమానులతో మాట్లాడుతున్న సీఐ సైదా

గజ్వేల్/రాయపోల్/కోహెడ, సెప్టెంబరు 8: వినాయక నిమజ్జనం రోజున డీజేలకు అనుమతి లేదని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా సూచించారు. గజ్వేల్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం సాయంత్రం డీజేల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మండపాల వద్ద, నిమజ్జనం వద్ద డీజేలు పెట్టవద్దని, వృద్ధులు, వయస్సు పైబడిన వారు డీజే శబ్దాల కారణంగా గుండెపోటు బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. ఎవరైనా డీజేలు పెడితే చట్టప్రకారం కేసు నమోదు చేసి, సీజ్ చేస్తామని హెచ్చరించారు. డీజేలు వినియోగించడానికి అనుమతి లేదని, యజమానులు గణేష్ మండపాలకు డీజేలను కిరాయికి ఇస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని రాయపోల్ ఎస్ఐ రఘుపతి హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని డీజే ఆపరేటర్లు, యజమానులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. వారందరికీ నోటీసులు జారీ చేశారు. ప్రశాంతమైన వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ అభిలాష్ సూచించారు. కోహెడ మండలంలోని శనిగరంలో గణేష్ ఉత్సవాలపై గ్రామస్థులతో శనివారం రాత్రి సమావేశం నిర్వహించారు. గ్రామంలో శనిగరం ప్రాజెక్టు ఉన్నందున గణేష్ నిమజ్జన ప్రదేశాల్లో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఆయనవెంట పోలీసు సిబ్బంది, గ్రామస్థులు ఉన్నారు.

డప్పు కళాకారులకు రూ. 5 వేల పింఛన్ ఇవ్వాలి

- దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

కోహెడ, సెప్టెంబరు 8: గ్రామాల్లో కులవృత్తిని నమ్ముకుని బతుకుతున్న డప్పు కళాకారులకు రూ 5 వేల పింఛన్ ఇవ్వాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని వింజపల్లిలో డప్పు కళాకారులతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. మాదిగల కులవృత్తి అయిన డప్పు కొట్టడం, చెప్పులు కుట్టడం లాంటి పనులకు దూరమవుతున్నారు. అనంతరం వింజపల్లి డీహెచ్‌పీఎస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. ఈ కమిటీలో కొంకటి ప్రశాంత్, చిట్యాల రజనీకాంత్, శంకర్, చిట్యాల శ్రీను, చిట్యాల మహేష్‌లను నూతన కమిటీగా ఎన్నుకున్నారు. మరో పదిమందిని సభ్యులుగా నియమించారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా దళిత హక్కుల పోరాట సమితి ఆర్గనైజింగ్ సెక్రెటరీ బోనగిరి శంకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ చిట్యాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడ్డ వారికి కాంగ్రెస్‌లో ప్రాధాన్యం

- సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ


పార్టీ కార్యాలయంలో బాణసంచా కాలుస్తున్న నాయకులు

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 8: కష్టపడ్డ వారికి కాంగ్రెస్‌లో ప్రాధాన్యం ఉంటుందని ఆ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సిద్దిపేట పట్టణంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో శనివారం బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, మున్సిపల్ కౌన్సిలర్ రియాజుద్దీన్, నాయకులు ముద్దం లక్ష్మి, కలీమొద్దీన్, సాకి ఆనంద్, బుచ్చిరెడ్డి, ఎల్లం యాదవ్, తప్పట శంకర్, గుర్రం అంజిరెడ్డి, మంద పాండు, గోపికృష్ణ, శాబు, మిద్దె రవి, సాంబమూర్తి, చెంది శ్రీనివాస్, ఎర్రబోలు రాజిరెడ్డి, రాజేష్ ఖన్నా, అర్షద్, వాహబ్, అజ్మత్, మెరుగు రాజు, కొడారి మల్లారెడ్డి, వనజ, కవిత, జనార్దన్‌రెడ్డి, బొంగోని శ్రీనివాస్‌గౌడ్, దుర్గయ్య, రాజమహమ్మద్, దుర్గాప్రసాద్, బాబు, నవీన్, వంశీ, అరవింద్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా సమస్య పరిష్కారానికి నిధులు

- మంజూరు చేయించిన డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, సెప్టెంబరు 8: చేర్యాల మండలం వీరన్నపేట గ్రామంలో కొంతకాలంగా విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయాల నివారణకు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి రూ.3.50లక్షలు నిధులు మంజూరు చేయించారని వీరన్నపేట మాజీ సర్పంచు కొండపాక భిక్షపతి తెలిపారు. తరచూ విద్యుత్ అవాంతరాలు నెలకొన్న విషయమై మరమ్మతుల కోసం రూ.5లక్షలు వ్యయం అవుతుందని విద్యుత్‌శాఖాధికారులు అంచనా వేయగా, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చొరవ వహించి వెంటనే రూ.3.50లక్షలు మంజూరు చేయించారని, మిగతా నిధులు త్వరితగతిన మంజూరుకు హామీ ఇచ్చారని తెలిపారు. ఆదివారం కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

స్వచ్ఛందంగా సభ్యత్వాల నమోదు

- బీజేపీ మండల అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి


వేలూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు చేయిస్తున్న బాల్‌రెడ్డి

వర్గల్, సెప్టెంబరు 8: కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ప్రజలు బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారని, బీజేపీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా తీసుకుంటున్నారని ఆ పార్టీ వర్గల్ మండల అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వేలూర్‌లో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ గ్రామానికి వెళ్లినా బీజేపీ శ్రేణులకు ప్రజలు బ్రహ్మరథం పడుతూ స్వాగతం పలుకుతున్నారన్నారు. ప్రజలంతా ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంక్షేమ పథకాలవైపు ఆకర్షితులవుతున్నారని, ప్రజలను చైతన్యవంతులుగా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వారికి వివరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పంజాల వెంకటేష్‌గౌడ్, సభ్యత్వ నమోదు కో కన్వీనర్‌లు దిండి నాగరాజు, బబ్బూరి రవీందర్, బూత్ అధ్యక్షుడు శివరాంగౌడ్, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ నరసింహులుగౌడ్ బీజేపీ నాయకులు తదితరులున్నారు.

ఆత్మీయ సమ్మేళనం


అక్బర్‌పేట-భూంపల్లి మండలం జంగపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2013-14లో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థుల పాఠశాలలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు శాలువ కప్పి సన్మానించారు. విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదిగిరి, నాగిరెడ్డి, ఎల్లం, శ్రీనివాస్ రెడ్డి, సుముకేశ్వర్‌రెడ్డి, గోవర్ధన్, చంద్రం, పూర్వవిద్యార్థులు ప్రసాద్‌గౌడ్, నాగరాజు, మానస, శిల్ప తదితరులున్నారు.

- మిరుదొడ్డి